# గాంధి

ఇరవై నాలుగేళ్ళయిందేమో... అప్పుడు హ్యూస్టన్‌లో వుండేవాళ్ళం. మాకు మంచి మిత్రుడు కృష్ణమూర్తిగారని ఒక కన్నడం ఆయనుండేవాడు. ఒక శనివారం ప్రొద్దున్నే ఫోన్ చేసి 'మీరు ఇవాళ మధ్యాహ్నం ఏంచేస్తున్నారు' అని అడిగాడు. 'ఏంలేదు ఖాళీనే' అన్నాను. 'పన్నెండున్నరకి మీ ఇంటికి వస్తాను. ఒకటిన్నరకి మీ ఇంటి దగ్గర థియేటర్లో గాంధీ సినిమాకి వెడదాం. వస్తారా' అన్నాడు.

'తప్పకుండా. నాకు రిఛర్డ్ అట్టిన్బరో అంటే చాల ఇష్టం. కానీ ఒక బ్రిటిష్ అతను వాళ్ళతో పోట్లాడిన మన గాంధీగారి గురించి అంత నిష్పక్షపాతంగా సినిమా తీస్తాడని అనుకోను' అన్నాను నా మనసులోని మాటని పైకి అంటూ. కృష్ణమూర్తి 'అందుకే వెళ్ళి చూద్దాం ఎలా తీశాడో. వస్తాను రెడీగా వుండండి' అన్నాడు.

అక్కడికి వెళ్ళేసరికే పెద్ద లైన్ వుంది టిక్కెట్లకోసం. అంత లైను ఏవో కొన్ని గొప్ప సినిమాలకి తప్ప నేనెప్పుడూ అమెరికాలో చూడలేదు. ఒకళ్ళిద్దరు తప్ప అందరూ అమెరికన్లే. లైన్‌లో నుంచున్నప్పుడు 'గాంధీ వేషం వేసింది ఎవరో బెన్ కింగ్స్‌లీ అని బ్రిటిష్ అతను. మనవాళ్ళెవరూ దొరకలేదేమో' అన్నాడు కృష్ణమూర్తి.

సినిమా మొదలు పెట్టినప్పటినించీ, నాలుగు గంటల సినిమా అయినా సరే, హాల్లో ఎవరూ కదలకుండా కూర్చున్నారు. సినిమా అవగానే అందరూ లేచి రెండు నిమిషాలు చప్పట్లు కొట్టారు. గాంధీ మీద ఎన్నో పుస్తకాలు చదివాను. ఆయన వ్రాసిన మై ఎక్స్‌పెరిమెంట్ విత్ ట్రూత్ చదవటమే కాక, నా గ్రంధాలయం లో భద్రంగా వుంది. తెలియని కథ ఏమీ కాదు. అయినా ఏమిటి ఈ అనుభూతి. ఎందుకలా హృదయాన్ని బరువెక్కించింది.

రెండే సమాధానాలు. ఒకటి ఆనాటి సంఘటనలని కళ్ళకి కట్టినట్టు చిత్రీకరించిన మేధావి అట్టిన్బరో గొప్పతనం. రెండవది నటనకే నిర్వచనం చెప్పిన బ్రిటిష్ నటుడు బెన్ కింగ్స్‌లీ పాత్ర చిత్రణ.

ఇక్కడే చిన్న పిట్ట కథ. ఆ సినిమా చూశాక వచ్చిన స్పందనతో ఆనాటి ఆంధ్రసచిత్రవారపత్రికలో అమెరికాలో గాంధీ అనే వ్యాసం వ్రాశాను. దాని చివరలో వీరాజీగారూ, మతుకుమల్లి మాధవరావుగారూ నా హ్యూస్టన్ అడ్రస్ ఇచ్చారు. అందువల్ల నా అడ్రస్ దొరక్క అవస్థ పడుతున్న ఒకళ్ళిద్దరు మిత్రులకి నా అడ్రస్ దొరికి, మళ్ళీ మా స్నేహం కొనసాగింది. అది ఈ వ్యాసానికి అనవసరం. అది సరేనయ్యా... మరి ఆనాటి బెన్ ఈనాడు ఎందుకు గుర్తుకి వచ్చాడు?

ఎందుకంటే ఆయన గురించి మనకి తెలిసిందానికన్నా తెలియని విషయాలే ఎక్కువ కనుక. బ్రిటిష్ రాణి బెన్ కింగ్స్‌లీని 'నైట్' చేసి ఆయన పేరు ముందు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సర్ బిరుదుని ఇచ్చింది. అందుకనే కాదు. ఆయన మహా నటుడు. నాకు బాగా నచ్చిన నటుడు. అందుకని.

o o o

బెన్ భారతీయుడా? కాదు. అవును. ఎందుకు కాదంటే ఆయన ఇంగ్లాండ్ లోని యార్క్‌షైర్‌లో పుట్టి అక్కడే పెరిగాడు. అతని తండ్రి గుజరాత్‌నించి ఇంగ్లాండ్ వచ్చి సెటిల్ అయిపోయిన రహింతుల్లా భాంజి. తల్లి బ్రిటిష్-రష్యన్ నటి నలైనా మేరీ. అతని అసలు పేరు కృష్ణ భాంజి. మొదటినించీ నాటకాల్లో నటించటం, ముఖ్యంగా షేక్స్‌పియర్ డ్రామాల్లో నటించటం అతనికి ఇష్టం. అతను ఆడిషన్‌కి వెడితే అతని పేరు వినగానే ముఖం తిప్పేసేవాళ్ళు. ఒకసారయితే అప్లికేషన్‌లో అతని పేరు కృష్ణినా బ్లాన్క్ అని చదివి, తీరా అతనది తన పేరు కాదని అసలు పేరు చెబితే ఇంటికి వెళ్ళమన్నారుట. అప్పుడు అతని తండ్రి, పేరు మార్చుకోమని సలహా ఇచ్చి బెన్ కింగ్స్‌లీ అనే పేరు ఆయనే పెట్టాడు. అది ఒక షేక్స్‌పియర్ నాటకం కోసం. మొదట్లో అతని పేరు చూసి వద్దనుకున్నవాళ్ళే, పేరు మార్చుకున్నాక ఆడిషన్ చేసి ఆయనకి వేషాలిచ్చారు.

'నా పేరే ఒక గమ్మత్తయిన పేరు. కృష్ణ అనేది హిందూ దేవుడి పేరు. భాంజీ అన్నది ముస్లిం పేరు. పేరు మార్చు కున్నది క్రిష్టియన్ పేరుకి. కాకపోతే గాంధీ వేషం వేశాను కనుక ఆ పేరు ఆయనకో నివాళి' అంటాడాయన.

రిచర్డ్ అట్టిన్బరో గాంధీ జీవితాన్ని సినిమా తీయటానికి ఉద్దేశ్యం వ్యక్తపరిచి సిద్ధమవుతున్నప్పుడు, బెన్‌కి ఆ వేషం వేయాలనే తహతహ మొదలయింది. గాంధీ జీవిత చరిత్రని పూర్తిగా చదివి, ఆ వేషం తప్పకుండా తనే వేయాలనే పట్టుదల పెంచుకున్నాడు. అట్టిన్బరోని కలిసి, ఆయనతో గాంధీ జీవిత చరిత్ర మీద ఎన్నో చర్చలు చేశాడు. అంతేకాదు తిండి తగ్గించేసి సన్నబడ్డాడు. చరఖా తిప్పటం నేర్చు కున్నాడు. పాత న్యూస్ రీళ్ళు డాక్యుమెంటరీలు చూసి గాంధీలా నడవటం నవ్వటం ఆ హావభావాలు అలవాటు చేసుకున్నాడు. తన బ్రిటిష్ ఇంగ్లీషుని గుజరాతీ ఇంగ్లీషు లో ఎలా మాట్లాడాలో సాధన చేశాడు. గాంధీలా మాట్లాడటానికి ఎన్నో రోజులు పగలూ రాత్రీ కష్టపడ్డాడు. ఆ మాటలు టేప్ చేసి అట్టిన్బరోకి ఇస్తే, ఈ మాటలు నీవి కావు గాంధీవే అన్నాడాయన, ఈయన నటనా చాతుర్యానికి ఆశ్చర్యపోయి.

'ఆ సినిమా తీసిన రోజుల్లో నేను మాంసాహారం అసలు ముట్టుకోలేదు. యోగా చేసేవాడిని. రోషన్ సేత్ లాటి మహానటుడు నెహ్రూగా నటించటం గొప్ప విషయం. అతను బ్రిటిష్ నాటకాల్లో (బ్రాడ్వే) మంచి పేరు సంపాదించిన నటుడు. గాంధీని నెహ్రూ ఎంతో గురు భావనతో మనసా వాచా ప్రేమించాడు. తెర మీదా, సినిమా తీసేటప్పుడూ రోషన్ సేత్ నన్ను అదే చేశాడు. ఆ అంకితమైన దీక్ష మా ఇద్దరినీ ముందుకు నడిపించింది. అలాగే కస్తూరి బాయ్ వేషం వేసిన రోహిణి హట్టంగాడి. మేమిద్దరం ఆ వేషాల్లో పూర్తిగా మునిగిపోయాం. ఆ సినిమా తీసేట ప్పుడు ఇద్దరం ఒక పార్టీకి వెళ్ళాం. ఆవిడతో మాట్లాడుతున్న వాడిని, ఎవరో పిలిస్తే కొంచెం దూరంగా వెళ్ళి వాళ్ళతో మాట్లాడుతున్నాను. కాసేపయాక ఆవిడ కోపంగా నా దగ్గరకి వచ్చి, నన్ను వదిలి ఎక్కడికి పోయారు అని అడిగింది సూటిగా. నేను బిత్తరపోయి చూస్తుంటే ఆవిడకి అప్పుడు గుర్తు వచ్చింది, మేం అక్కడికి కలిసి కూడా రాలేదని. ఇద్దరం నవ్వుకున్నాం ఆ వేషాల్లో ఎంతగా మునిగి పోయామా

అని' అంటాడు బెన్ పెద్దగా నవ్వుతూ.

గాంధీగా గాంధీని మించిపోయాడు. గాంధీలా అతనూ మన మనసుల్లో నిలిచిపోయాడు. ఇంకెవరికీ ఆ బహుమతి వచ్చే ఆస్కారం ఇవ్వకుండా ఆస్కారు పురస్కారం స్వంతం చేసుకున్నాడు. గాంధీ వేషం చేయటం ఒక యజ్ఞంగా భావించి జీవంపోయటమే కాక, ఆ యజ్ఞ ఫలాన్ని కూడా చవిచూసిన యోగి అతను. అటు నటనకి ఆస్కార్ బహుమతే కాకుండా, 1984లో సంగీతంలో బహుమతులిచ్చే గ్రామీ బహుమతిని తన 'ది వర్డ్స్ ఆఫ్ గాంధీ' అనే మాటల టేపుకి పురస్కారం సంపాదించుకున్నాడు. 'జీవితం మీద నా దృక్పధాన్నే పూర్తిగా మార్చేసిన పాత్ర అది' అంటాడు బెన్ కింగ్స్‌లీ.

1966లో మొట్టమొదటగా బెన్ లండన్ స్టేజ్ మీద అడుగుపెట్టాడు, ఎ స్మాషింగ్ డే అనే నాటకానికి వ్యాఖ్యాతగా. దానికి నిర్మాత బీటిల్స్‌కి మానేజర్‌గా పని చేసిన బ్రయాన్ ఎప్‌స్టెయిన్. దానికి వ్యాఖ్యానమొకటేకాక బెన్ సంగీతం సమకూర్చి, గిటార్ వాయించి పాటలు కూడా పాడాడు. బ్రయాన్ అతన్ని గాయకుడిని చేస్తా, నంటే, నాకు నటుడవాలని వుంది అని చెప్పి నటన మీదే దృష్టి నిలిపాడు బెన్. బగ్సీ షిండ్లర్స్ లిస్ట్, సెక్సీ బీస్ట్, సెర్చింగ్ ఫర్ బాబీ ఫిషర్, హౌస్ ఆఫ్ శాండ్ అండ్ ఫాగ్, థండర్ బర్డ్స్ లాటి సినిమాల్లో వివిధ రకాల వేషాలు వేశాడు అతను. పాత్ర పాత్రకీ వైవిధ్యం. విలన్‌గా వేసినా, కామెడీ చేసినా కనపడేది బెన్ కింగ్స్‌లీ కాదు. ఆ పాత్ర.

2001లో బ్రిటిష్ రాణి ఆయనకి సర్ బిరుదు నిచ్చింది. దాన్నే అక్కడ 'నైట్' చేయటమంటారు. అది చాల గొప్ప విషయం అక్కడ. ఎంతో మంది ఎంతో ఆశ పడినా అందనిది.

'బ్రిటిష్ వాళ్ళకి అవతలివాళ్ళు అపజయం పొందాలనే కోరిక చాల సహజం. నేనేదన్నా రెస్టారెంట్లో కూర్చుని వుంటే వాళ్ళకి నా దగ్గరికి వచ్చి పలకరించాలనే కోరిక. కానీ రావాలంటే నేను పరాయివాడిని. అందుకే రారు' అంటూనే పెద్దగా నవ్వుతాడు బెన్. 'నేను ఆ రోజు హాలీవుడ్ దగ్గర బెవర్లీ హిల్స్‌లో ఒక హోటల్లో వున్నాను. అప్పుడే ప్రైమ్ మినిస్టర్ టోనీ బ్లెర్ నించీ ఉత్తరం వచ్చింది, నన్ను నైట్ చేసి సర్ బిరుదుని ఇస్తారని. ఎన్నడూ అనుకోనిదది. రెక్స్ హారిసన్, పీటర్ ఓ టూల్, అలెక్ గిన్నీస్‌లాటి ప్రముఖులకి లభించిన అరుదైన పురస్కారం. అప్పుడే అనుకున్నాను బ్రిటిష్ వాళ్ళకి అవమాన పరచటమే కాదు, ఆశ్చర్యపరచటం కూడా తెలుసని' అన్నాడు బెన్ పత్రికా విలేఖరులతో.

లండన్‌లో ఆయనకి ఆ పురస్కారం ఇచ్చే సమయంలో ఆయన వేసిన మిగతా పాత్రలతో పాటు గాంధీ పాత్రని తెర మీద చూపిస్తున్నప్పుడు అందరూ నుంచుని చప్పట్లు కొట్టారు. బహుమతి తీసుకుంటున్నప్పుడు వెనకాల వైష్ణవ జనతో అనే పాటని వినిపిస్తుంటే రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తూ కళ్ళు మూసుకుని కదలకుండా నుంచుని వున్న బెన్ కింగ్స్‌లీ, అదే కృష్ణ భాంజీ, కళ్ళల్లోనించి నీళ్ళు ప్రవహించాయని విన్నవాళ్ళకి అర్ధమవుతుంది, గాంధీ పాత్రలో బెన్ జీవించాడో, ఆ పాత్రని గాంధీగారి వ్యక్తిత్వమే నడిపించిందో!